ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5
నారాయణపేట
జిల్లా వార్తలు
ఆదివారం 31 ఆగస్టు 2025



పేట, కొడంగల్ ఎత్తిపోతలకు
వ్యతిరేకం కాదు
● భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వండి
● బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ
7

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక
విద్యల్లో పట్టు సాధించాలి
● పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్
● వర్సిటీలో ఓరియెంటేషన్ ప్రోగ్రాం
7

సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలి
● గణేశ్ ఉత్సవాల్లో అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ
6

అసెంబ్లీ సమావేశాలకు హాజరైన జిల్లా ప్రజాప్రతినిధులు



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి





అసెంబ్లీ సమావేశాలకు వస్తున్న ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి(జడ్చర్ల), మేఘారెడ్డి(వనపర్తి)

హైదరాబాద్‌లోని అసెంబ్లీలో శనివారం నిర్వహించిన సమావేశాలకు ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. సమావేశాలకు హాజరైన వారిలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తదితరులు ఉన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

● అందుబాటులోకి సీటీ స్కాన్ సేవలు
● త్వరలో ఈఎన్‌టీ, ఆర్థో విభాగం ఆపరేషన్లు
● 'ఆంధ్రజ్యోతి'తో 'పేట' మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కే.సంపత్‌కుమార్ సింగ్



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న సంపత్‌కుమార్ సింగ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నారాయణపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని నారాయణపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కే.సంపత్‌కుమార్ సింగ్ అన్నారు. శనివారం ఆయన మెడికల్ కాలేజీలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

సీటీ స్కాన్ సేవలు ప్రారంభం కావడంలో జాప్యం ఎందుకు జరిగింది?

ప్రభుత్వం రూ.రెండు కోట్లతో జనరల్ ఆస్పత్రికి సీటీ స్కాన్ యాంత్రాన్ని పంపించింది. కానీ సంబంధిత రేడియాలజీ టెక్నీషియన్ల నియామకం కోసం కాస్త సమయం పట్టింది. తాజాగా ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఈ సేవలను ప్రారంభించారు.

ఆస్పత్రిలో ఈఎన్‌టీ, ఆర్థో విభాగం ఆపరేషన్లు జరగడం లేదు. ఎందుకు?

అవును జరగడం లేదు. మరో పది రోజుల్లో ఈ రెండు విభాగాల ఆపరేషన్లు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఈఎన్‌టీకి సంబంధించి మైనర్ ఆపరేషన్లు ఇప్పటి వరకు 20 నిర్వహించాం. ఇప్పటికే గైనిక్, జనరల్ సర్జరీలు, పీడియాట్రిక్ సేవలతో పాటు ఆపరేషన్లు జరుగుతున్నాయి. నెలకు 35 నుంచి 45 వరకు అత్యవసర సర్జరీలు, 300 నుంచి 320 వరకు ప్రసవాలు అవుతున్నాయి.

జనరల్ ఆస్పత్రి సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది కదా?

97 పోస్టులకు 57 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నెల రోజుల్లో సిబ్బంది వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడున్న 40 మంది సిబ్బంది సమష్టి కృషితో మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తున్నారు.

రోజుకు ఎంత మంది ఓపీ సేవలు పొందుతున్నారు?

రోజుకు 800ల నుంచి వెయ్యి మంది వరకు ఓపీ రోగులు సేవలు పొందుతున్నారు. ప్రస్తుతం వైరల్ ఫీవర్ సీజన్ కొనసాగుతోంది. ఇన్ పేషెంట్స్ 160 మంది వరకు చికిత్స చేయించుకుంటున్నారు.

ఆస్పత్రిలో మొత్తం 220 బెడ్లు ఏర్పాటు చేయలేదు కదా?

ఇప్పటి వరకు 160 బెడ్లు ఏర్పాటు చేశాం. మరో 60 బెడ్లు త్వరలో మూడో అంతస్తులో ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

మందుల కొరత ఉందా?

ఆస్పత్రిలో అవసరం మేర అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి.

యూరియా కొరత.. తీరని వ్యథ

ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉదయం నుంచే రైతుల బారులు



అయిజ రైతు వేదిక వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న మహిళా రైతులు



అమరచింతలో యూరియా టోకెన్ల కోసం పోలీసులతో వాగ్వాదానికి దిగిన రైతులు

● రహదారులు, కూడళ్లు, పీఏసీఎస్‌ల వద్ద రైతుల నిరసనలు
● ఒక్కోరైతుకు రెండు నుంచి ఒక్క బస్తాకు తగ్గిన సీలింగ్
● లైన్లను అదుపు చేయలేక పలుచోట్ల పోలీసుల అత్యుత్సాహం
● మరికల్ మండలం తీలేరులో రైతుపై చేయి చేసుకున్న ఎస్‌ఐ రాము

మహబూబ్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరినాట్లు ఇంకా కొనసాగుతుండటం, పత్తి, మొక్కజొన్నవంటి పంటలకు ఈ దశలో ఎరువులు వేయాల్సిన పరిస్థితి ఉండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. గతంలో ఒక్కో రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇస్తామని సీలింగ్ విధించగా.. ఇప్పుడు అది కాస్త ఒక్క బస్తాకు తగ్గించారు. విక్రయ కేంద్రాల్లో నిల్వ ఉన్న యూరియా బస్తాల కంటే లైన్లలో నిల్చునే రైతులు అధికంగా ఉంటున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కో

(మిగతా 6లో..)

క్రీడా హబ్‌గా తెలంగాణ

● గత సర్కార్ నిర్లక్ష్యం చేసింది
● రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి
● అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీ

ఆటలకు రూ.460 కోట్ల బడ్జెట్



పతకాలు సాధించిన క్రీడాకారులకు మెడల్స్ అందజేసిన రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడల హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర స్పోర్ట్స్ ఆథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌పై జి.రాజేంద్రప్రసాద్ స్మారక 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నారు. అండర్-14, 16, 18, 20 జూనియర్ బాల, బాలికల విభాగాల్లో క్రీడలను ఏర్పాటు చేస్తున్నారు. శివసేనారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఎంపీ జితేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివసేనా రెడ్డి మాట్లాడుతూ పదేళ్లుగా బీఆర్ఎస్ సర్కార్ క్రీడలను

(మిగతా 6లో..)



చిన్నారులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేస్తున్న కలెక్టర్

అనాథలకు స్పోర్ట్స్ దుస్తులు అందజేత

నారాయణపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్డు వద్ద గల బాల సదనం(అనాథ ఆశ్రమం) చిన్నారులకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. 48 మంది అనాథ చిన్నారులకు కలెక్టర్ తన నిధులతో దుస్తులను, చెస్, క్యారమ్స్ షటిల్, రింగ్‌బాల్ ఆట వస్తువులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి పంపిణీ చేశారు. స్పోర్ట్స్ బూట్లను కూడా తెప్పించాలని నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ చిన్నారులతో ముచ్చటించారు. బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, ఆటలు ఆడాలని చెప్పారు. భోజనం బాగుందా? అని అడిగారు. కరాటే, కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇప్పించాలని డీసీపీవో కరిష్మాను ఆదేశించారు. పక్కనే ఉన్న వయోవృద్ధుల ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న ఏడుగురు వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

● వచ్చేనెల 3న మూసాపేట మండలంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
● హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్, ఎస్పీ జానకి



సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఎస్పీ జానకి

మూసాపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మూసాపేట మండలంలో వచ్చే నెల 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఎస్పీ జానకి శనివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వేముల గ్రామ శివారులో గల ఎస్‌జీడీ ఫార్మా(కోజెంట్) కంపెనీలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఆ పరిశ్రమలో రెండో యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగ సమావేశం ఉంటుందని, తర్వాత మూసాపేటలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తారని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు వాతావరణం అనుకూలంగా ఉంటే హెలీక్యాప్టర్‌లో వస్తారని, లేదంటే రోడ్డు మార్గంలో వస్తారని చెప్పారు. వారి వెంట తహసీల్దార్ రాజు, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ ఎం.వేణు, ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేయాలి: కలెక్టర్

సీఎం రేవంత్‌రెడ్డి మూసాపేటలో ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. శనివారం ఆమె నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. సీఎం పర్యటనలో భాగంగా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.

ఫిట్‌నెస్‌లు ఇక పారదర్శకం

● పాలమూరుకు ఏటీఎస్ మంజూరు
● రూ.6.07 కోట్లు కేటాయింపు



మాన్యువల్ పద్ధతిలో బస్సు ఫిట్‌నెస్ పరీక్షిస్తున్న అధికారులు(ఫైల్)

మహబూబ్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పాలమూరు డీటీసీకి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)కు అనుమతులు ఇస్తూ ప్రభుత్వం రూ.6.07 కోట్లను మంజూరు చేసింది. రాష్ట్రంలో పది ఏటీఎస్‌లను మంజూరు చేయగా అందులో మహబూబ్‌నగర్ కూడా ఉండటం విశేషం. ఇదివరకు సరుకులు రవాణా చేసే వాహనాల ఫిట్‌నెస్ విషయంలో చిన్న చిన్న లోపాలున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించేవాళ్లు. కొందరు అధికారులను మేనేజ్ చేసుకుని ఎంవీఐ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపేవారు. ఇకపై మోటార్ వెహికిల్ చట్టం నిబంధనల ప్రకారం పక్కాగా ఫిట్‌నెస్ ఉంటేనే ఆ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు కానున్నాయి. ఇంతకు ముందు సరుకు రవాణా వాహనాలకు మాన్యువల్‌గా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే వారు. ఈ చేసేక్రమంలో



చాలా వాహనాలు ఫిట్‌నెస్ లేకున్నా అధికారులు వదిలేసేవారన్న విమర్శలున్నాయి. ఒక్కోసారి ఈ వాహనాల వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయి. ఇకపై ఇలాంటి వాటికి ఏటీఎస్ చెక్ పెట్టనుంది. పూర్తిగా కంప్యూటరైజ్డ్ విధానంలో వాహనాలను మిషన్ సాయంతో చెక్ చేయనున్నారు. నిబంధనల ప్రకారం అన్నీ సక్రమంగా ఉంటేనే సిస్టమ్ అంగీకరిస్తుంది. ఏవైనా లోపాలుంటే ఫలానా ఉల్లంఘనలు ఉన్నాయని గుర్తిస్తుంది. అధికారులు మళ్లీ వాటిని సరిచేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. మెకానిక్‌ల వద్దకు వెళ్లి వాటిని సరిచేసుకుని వస్తే మిషన్‌ద్వారా మరోసారి వెరిఫై చేసి, అన్ని ఒకే అంటే అప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ఈ ఆటోమేటివ్ టెస్టింగ్ స్టేషన్‌కు 5 ఎకరాల స్థలం కావాల్సి ఉంటుంది. ఇక్కడి డీటీసీకి 5 ఎకరాల స్థలం ఉంది. త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి.

యూరియా కొరత.. తీరని వ్యథ

(5వ పేజీ తరువాయి)

రైతుకు సీలింగ్ ప్రకారం ఒక్క బస్తా ఇవ్వడానికి కూడా ఎరువు సరఫరా కావడం లేదు. అధికారులు మాత్రం యూరియా కొరత లేదనే పాత పాటే పాడుతున్నారు. కేంద్రం ఇటీవల కేటాయించిన 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరుకుంటే కానీ పరిస్థితులు అదుపులోకి రావడం కష్టంగానే కనిపిస్తోంది. ఇదే అదనుగా ప్రైవేటు దుకాణాల నిర్వాహకులు ఎక్కువ ధరలకు అమ్మి.. సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా యూరియాను నిల్వ ఉంచుకుంటున్నారు. వారు అధిక ధరలకు ఎరువుల విక్రయాన్ని కట్టడి చేసేందుకు విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారు. శుక్రవారం పెద్దమందడి మండలం వెల్టూరులో రామలింగేశ్వర ఫర్టిలైజర్ దుకాణంలో ఇదే కారణంతో 300 యూరియా బస్తాలను స్వాధీనం చేసుకుని కేసు కూడా నమోదు చేశారు. యూరియా కొరత ఏర్పడుతుందనే అంచనాలు వేసుకున్న కొందరు రైతులు, పలుకుబడి ఉన్నవారు నిల్వ చేసుకోవడంతో కూడా కొరత తీవ్రమైనట్లుగా అధికారులు భావిస్తున్నారు.

పోలీసుల అత్యుత్సాహం..

ఒక్క యూరియా బస్తా దొరికితే చాలు.. పంటలు కాపాడుకోవచ్చనే ఉద్దేశంతో రైతులు ఉదయం నుంచే బారులు తీరుతున్నారు. తిండి తిప్పలు మానేసి లైన్లలో వేచి ఉంటున్న వారిని కొంత సమన్వయంతో శాంతింపజేయాల్సిన అవసరం ఉంది. కానీ కొన్నిచోట్ల పోలీసులు వారిని అదుపు చేయడంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. కొరత ప్రారంభమైన కొత్తలో నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని సింగిల్ విండో వద్ద తోపులాట జరగ్గా.. పోలీసులు తోయడంతో ఒక రైతు చేయికి గాయమైంది. ప్రతీ రోజూ రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద బారులు తీరుతుండటంతో పోలీసులు కూడా అదుపు చేయలేక అసహనానికి గురవుతున్నారు. తాజాగా నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరులోనూ పోలీసుల అత్యుత్సాహం కనిపించింది. లైన్‌లో రైతులను అదుపు చేసే క్రమంలో మరికల్ ఎస్ఐ రాము ఒక యువ రైతుపై చేయి చేసుకున్నాడు. ముందుగా చేయి ఎత్తి బెదిరించి, తర్వాత చెంపపై కొట్టాడు. దీనిపై స్పందించిన నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ రైతులపై దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐ రాముపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. రైతుపై చేయి చేసుకున్న విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఓవైపు కొరత తీర్చకుండా.. మరోవైపు రైతులపై దాడులు చేస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. కావాలని ఎస్ఐ తనను కొట్టలేదని రైతు సత్యనారాయణ వివరణ ఇవ్వడం గమనార్హం.

రాజకీయ దుమారం..

యూరియా కొరత ప్రారంభమైనప్పటి నుంచి అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ దుమారం రేగుతూనే ఉంది. తమ హయాంలో యూరియా కొరత లేదని, ముందస్తుగానే నిల్వలు ఉంచుకోవడం వల్ల రైతులకు ఇబ్బందులు కలుగనివ్వలేదని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారు. ఆ పార్టీ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో యూరియా కొరతను ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. ఎక్కడైనా రైతులకు ఇబ్బంది కలిగితే పొలిటికల్‌గా మైలేజీ పొందడానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. మరోవైపు యూరియా కొరతపై కాంగ్రెస్ పార్టీ అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీలను కౌంటర్ చేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో యూరియా కొరతతో రైతుల క్యూలైన్లు, అప్పటి ప్రజాప్రతినిధుల ప్రకటనలను సోషల్ మీడియాలో పెట్టి.. ఎదురుదాడి చేస్తోంది. తీలేరు ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పోస్టు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సున్నితంగా మారిన యూరియా కొరత విషయాన్ని ఆయా పార్టీలు పొలిటికల్ కోణంలో చూస్తూ దాడి, ప్రతి దాడులు చేసుకుంటున్నాయి. మహబూబ్‌నగర్‌లోనూ ఈ నెలలోనే ఓ వ్యక్తి విక్రయ కేంద్రం వద్ద సొమ్మసిల్లి పడిపోవడం బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య వివాదాన్ని రేపింది.

మోస్తరు వర్షం

నాగర్‌కర్నూల్ టౌన్/నారాయణపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసింది. నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో 24.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. తిమ్మాజిపేట మండలంలో 13.8, బిజినేపల్లిలో 12.4, అచ్చంపేటలో 12.0, వంగూరులో 10.8, నాగర్‌కర్నూల్‌లో 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో 17.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వర్షానికి కూలిన ఇల్లు

» ఇద్దరికి గాయాలు

మరికల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో కురిసిన భారీ వర్షాలకు శనివారం మేకల ప్రసాద్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు వారు వెంటనే బయటకు పరుగులు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బాధితులను గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్‌రెడ్డి సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కోతుల దాడిలో ఉపాధ్యాయురాలికి గాయాలు

వెల్దండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కోతులు దాడిచేయడంతో ఉపాధ్యాయురాలు గాయపడిన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. పాఠశాలకు చెందిన రామేశ్వరమ్మ అనే ఉపాధ్యాయురాలిపై కోతులు దాడిచేసి గాయపరిచాయి. దీంతో ఆమె స్థానిక ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. కోతులు దాడిచేయడంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తంచేశారు. కోతుల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ కోరారు.

పర్వతారోహణ శిబిరానికి ఎంపిక

నారాయణపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్స్ పర్వతారోహణ శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సీ వసంత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన అన్వేష, జయశ్రీ, నాగేశ్వరి తృతీయ సంవత్సరం విద్యార్థులు కేరళలో జరిగే ఆల్ ఇండియా పర్వతారోహణ శిబిరాలలో పాల్గొంటారని పేర్కొన్నారు. వారు పది రోజుల పాటు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను శనివారం కళాశాలలో అభినందించి వారు కేరళ శిబిరానికి బయలుదేరారు. ఎన్‌సీసీ ఇన్‌చార్జి సుజత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమయానికి బస్సు నడపాలి



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

నారాయణపేటరూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాల సమయాలకు బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండ్ ముందు మండలంలోని పేరపళ్ళ విద్యార్థులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సమయాకికి బస్సులు రాకపోవడంతో పాఠశాల, కళాశాలలకు ఆలస్యంగా వెళ్ళాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 8.30గంటల లోపు తమ గ్రామానికి బస్సు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డిపోమేనేజర్ ఫోన్లో విద్యార్థుల సమస్యను పరిష్కరిస్తామని హామీనివ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నరేష్, సతీష్, వివేకానంద, చరణ్‌రెడ్డి, ఇంతియాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బలోపేతం దిశగా..

» సర్కార్ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యకు శ్రీకారం

» గద్వాల జిల్లాలో తరగతుల నిర్వహణకు ఎంపికైన 19 పాఠశాలలు

గద్వాల సర్కిల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. అందులో భాగంగా ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది (2025-26 విద్యా సంవత్సరం)నుంచే పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గత నాలుగు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా ఉత్తర్వులు జారీ చేసింది. సర్కార్ బడుల్లో మెరుగైన పాఠశాల విద్యను అందించే క్రమంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో 19 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగే ప్రీ ప్రైమరీ విద్యాభ్యాసం (యూకేజీకి సమాంతర విద్య) ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో తరగతుల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు బలోపేతం దిశగా పయనించనున్నాయి.

జిల్లాలో 285 ప్రాథమిక పాఠశాలలు...

జోగుళాంబ గద్వాల జిల్లాలో 285 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అందులో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 20,932 మంది ఉన్నారు. ఈ ఏడాది నుంచే పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతినివ్వడంతో తల్లిదండ్రులు నాలుగేళ్లు దాటిన తమ చిన్నారులను ఎంపికైన ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశం కల్పించేందుకు సన్నద్ధం కానున్నారు.



పూర్వ ప్రాథమిక విద్యకు ఎంపికైన గద్వాల మండలంలోని పర్మాల ఎంపీపీఎస్

ప్రీ ప్రైమరీ పాఠశాల విద్యకు జిల్లాలో 19 పాఠశాలలు ఎంపిక...

2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు అనుమతులు ఇస్తూ జిల్లాలోని 19 ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి ఉత్తర్వులు జారీ చేసింది.

వాటిలో గద్వాల మండలం పర్మాల ఎంపీపీఎస్, మల్దకల్ మండలంలోని నాగర్‌దొడ్డి ఎంపీయూపీఎస్, ఉలిగేపల్లి ఎంపీపీఎస్, ధరూర్ మండ లం యనుమోనిపల్లి ఎంపీపీఎస్, గట్టు మండలంలోని చమాన్‌ఖాన్‌దొడ్డి ఎంపీపీఎస్, ఇందువాసి ఎంపీపీఎస్, ఆరగిద్ద ఎంపీపీఎస్, ఆలూరు ఎంపీపీఎస్, బల్గెర ఎంపీ పీఎస్, కేటిదొడ్డి మండలంలోని నందిన్నె ఎంపీపీఎస్, చింతలకుంట ఎంపీపీఎస్, అలంపూర్ ఎంపీపీఎస్ (గర్ల్స్), అయిజ మండలంలోని కేశవరం ఎంపీయూపీఎస్, ఈడిగోనిపల్లి ఎంపీయూపీఎస్, ఇటిక్యాల మండలం చాగాపూర్ ఎంపీపీఎస్, ఎర్రవల్లి మండలం కారుపాకుల ఎంపీపీఎస్, వడ్డేపల్లి ఎంపీపీఎస్, ఉండవల్లి మండలం మారమునగాల-1 ఎంపీపీఎస్, రాజోలి మండలం చింతలక్యాంపు ఎంపీపీఎస్‌లున్నాయి.

ప్రతీ పాఠశాలకు ఒక ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా...

పూర్వ ప్రాథమిక విద్యలో భాగంలో ప్రవేశం పొందిన విద్యార్థుల తరగతుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపికైన ప్రతీ పాఠశాలకు ఒక ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయాను నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణత, ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి.

ప్రవేశం పొందిన విద్యార్థులకు కల్పించే మౌలిక వసతులు

ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపికైన పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ప్రవేశం పొందిన చిన్నారులకు ప్రత్యేక తరగతులు కేటాయిస్తారు. వారికి ఆహ్లాదభరితమైన వాతావరణం కల్పించేలా అన్ని వసతులు కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో పాటు ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం కల్పిస్తారు. ప్రీ ప్రైమరీలో చేరే ప్రతి విద్యార్థి పూర్తి వివరాలను యూడైస్‌లో నమోదు చేస్తారు.

ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం..

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచే పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణకు ఉత్వర్వులు జారీ చేసింది. ప్రైవేట్ పాఠశాలలో అందించే ప్రీ ప్రైమరీ విద్యను ఇప్పుడు ప్రభుత్వం పాఠశాలల్లోనూ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. తల్లిదండ్రులు నాలుగేళ్ల దాటిన తమ చిన్నారులను ప్రీ ప్రైమరీ విద్య కోసం కల్పించే ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో ఎంపికైన 19 పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. తరగతుల నిర్వహణకు 19 మంది ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, 19 ఆయా పోస్టులను తాత్కాలిక పద్ధతిపై భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- ఎస్తేర్‌రాణి, జిల్లా విద్యా శాఖ సమన్వయ అధికారి, గద్వాల



మార్చ్ నిర్వహిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు



జావెలిన్‌త్రో చేస్తున్న క్రీడాకారుడు

క్రీడా హబ్‌గా తెలంగాణ

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వాలు క్రీడాభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.50 కోట్లు ఇస్తే, కాంగ్రెస్ సర్కార్ రెండేళ్లలో రూ.850 కోట్లు క్రీడా బడ్జెట్ కేటాయిందని తెలిపారు. రాష్ట్రంలోని అకాడమీలు, హస్టల్స్, స్పోర్ట్స్ స్కూల్‌లో మౌలిక వసతుల కల్పన కృషి చేస్తున్నామని తెలిపారు. 3వ విడతలో జిల్లా, మండల కేంద్రాల్లో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. అందరూ మెచ్చేలా తెలంగాణ క్రీడా పాలసీ తెచ్చామన్నారు. ఒలింపిక్ క్రీడల్లో చిన్న దేశాలు పతకాలు సాధిస్తున్నాయని, 140 కోట్ల జనాబా ఉన్న మన దేశంలో ఒక్క పతకం సాధిస్తున్నామన్నారు. 2036 ఒలింపిక్ క్రీడల్లో దేశంలోనే తెలంగాణ క్రీడాకారులు అధిక పతకాలు సాధించేలా తయారు చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

క్రీడాభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు: జితేందర్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో క్రీడాభివృద్ధికి రూ. 16 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇండోర్ స్టేడియంలో ఏసీ, స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే వాలీబాల్ అకాడమీ ప్రారంభించామని అన్నారు. కబడ్డీ అకాడమీని కూడా నెలకొల్పుతామన్నారు. క్రీడల్లో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలపాలన్న సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. అంతకు ముందు క్రీడా జ్యోతిని వెలిగించారు. వివిధ జిల్లాల క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. క్రీడాకారులకు పతకాలు అందజేశారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, మాజీ వీ సీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, డీవైఎస్‌వో శ్రీ నివాస్, టీజీపీడీ, పీఈటీ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్ర ధాన కార్యదర్శి సారంగపాణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మార్టిన్, శరత్‌చంద్ర పాల్గొన్నారు.



పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు

విజేతల వివరాలు..

ఆయా విభాగాల్లో పలువురు క్రీడాకారులు తొలిరోజు ప్రతిభ చాటి, పతకాలు సాధించారు. అండర్-18 బాలికల డిస్కస్‌త్రో విభాగంలో పౌర్ణమి(మహబూబ్‌నగర్) బంగారు పతకం సాధించింది.

సింధు(హన్మకొండ) రజతం, అక్షయసింధు(జనగామ) కాంస్య పతకాలు సాధించారు. అండర్-14 బాలికల జావెలిన్ త్రోలో సంయుక్త శ్రీ(హన్మకొండ), వృధిక(కొత్తగూడెం), అస్మా, భూపాలపల్లి), బాలుర విభాగం డిస్కస్‌త్రోలో సునీత కుమార్(జనగాం), వరుణ్‌గౌడ్ (రంగారెడ్డి), రాజేంద్ర(జనగాం) వరుసగా బంగారు, రజతం, కాంస్య పతకాలు సాధించారు. అండర్-14 జావెలిన్ త్రో బాలుర విభాగంలో రాకేష్(ఆదిలాబాద్), అనురాగ్‌పేట్(తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్), కరుణదేవ్(టీఏఏ), అండర్-18 బాలికల 3 వేల మీటర్ల పరుగు పందెంలో పందు(హన్మకొండ), ముస్కాన్(హైదరాబాద్), రిషిక(ఆదిలాబాద్), బాలుర 5 వేల మీటర్ల పరుగు పందెంలో మోహిత్(టీఏఏ), అశోక్ రాథోడ్(మెదక్), ధోని(నల్గొండ), అండర్-20 బాలుర విభాగంలో 10 వేల మీటర్ల పరుగు పందెంలో గణేష్(సిద్దిపేట), జశ్వంత్(ఆదిలాబాద్), అబ్దుల్ కరీం(గద్వాల), అండర్-20 బాలికల విభాగంలో 5 వేల మీ పరుగు పందెంలో వరలక్ష్మీ(వికారాబాద్), ఉషారాణి(కొత్తగూడెం), నందిని(వనపర్తి) వరుసగా బంగారు, రజతం, కాంస్య పతకాలు సాధించారు.

సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

» గణేశ్ ఉత్సవాల్లో అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి

కొల్లాపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు నేటి తరం యువత ముందుండాలని అంబాత్రేయ క్షేత్రపీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి కోరారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని శివగంగ యువక బృందం ఆధ్వర్యంలో పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో విఘ్నేశ్వరుడిని శనివారం అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివగంగ యువక బృందం సభ్యులు పట్టణ ప్రజలు అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామికి ఘనంగా స్వాగతం పలికి శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ పట్టణ ప్రజల ను ఉద్దేశించి ఆదిత్య పరాశ్రీ స్వామి మాట్లా డుతూ... మన చుట్టూ ఉన్న ప్రదేశాలలో ఎక్కడ జాతరలు కానీ దైవ కార్యక్రమాలు జరి గిన అందరూ తప్పక పాల్గొని సంఘటితంగా సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కొల్లాపూ ర్ పట్టణ ప్రజలకు ఆయన ఆశీస్సులు అంద జేశారు. శివగంగ యువక బృందం ఆధ్వర్యం లో భక్తులకు అన్నదానం నిర్వహించారు. బీ జేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్ రావు, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మహిళలు శివగంగ యోగా సభ్యులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో శివగంగ గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ

సీఎంతో మాట్లాడి రూ. 20 లక్షలు పరిహారం ఇప్పిస్తా

దామరగిద్ద, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కానుకుర్తి రిజర్వాయర్‌లో భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ. 20 లక్షలు ఇప్పిస్తానని డీసీసీ నారాయణపేట మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని కానుకుర్తిలో పరిహారం పెంపు కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు దగ్గర వెళ్లి భూ నిర్వాసితులతో గ్రామ నాయకులతో చర్చించారు. తమకు ఎకరాకు రూ. 35లక్షలు పరిహారం ఇస్తేనే రిజర్వాయర్ నిర్మాణానికి భూములు ఇస్తామని రైతులు తెల్చి చెప్పారు. దీంతో శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం నారాయణపేట సభలో రూ.20 లక్షలు ఇస్తామని చెప్పారని అదే మాట ప్రకారమే సీఎంతో మాట్లాడి ఇప్పిస్తానని అన్నారు. కొంత మంది రైతులు ఎకరాకు రూ. 35 లక్షలు ఇస్తేనే రిజర్వాయర్ నిర్మాణానికి భూములు ఇస్తామని లేకపోతే ఇవ్వమని శివకుమార్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. రైతులతో రెండు గంటల పాటు చర్చలు జరిపినా ఒప్పుకోకపోవడంతో అసహనానికి గురైన శివకుమార్‌రెడ్డి దీక్ష శిబిరం నుంచి వెళ్లిపోయారు.



కానుకుర్తి రైతులతో చర్చిస్తున్న శివకుమార్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో శనీశ్వర స్వామికి అభిషేకాలు

బిజినేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో తిల, తైల అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ భక్తుల జన్మ, గోత్ర రీత్యా గ్రహ దోషాలు తొలగుటకు శనిగ్రహ శాంతి కోసం శనీశ్వర స్వామిని శనివారం పూజించాలని సూచించారు. శనీశ్వర స్వామిని నల్లని వస్త్రాలు ధరించి నల్ల నువ్వులు, నువ్వుల నూనె, జిల్లెడు ఆకులు, పూలు, జమ్మి ఆకులతో పూజించాలని తెలిపారు. అనంతరం రుద్ర శివుడి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాల్‌రావు, వీరశేఖర్, ప్రభాకరాచారి, అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

భారీ వర్షాలతో రాకపోకలకు అంతరాయం

» బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

అచ్చంపేట, ఆగసు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి నుంచి మన్నెవారిపల్లి గ్రామం వరకు అవసరమైన చోట వంతెన నిర్మాణాలు చేపట్టాలని రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఈ రహదారులు పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి ప్రయాణికులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజల భద్రత దెబ్బతింటుందని పనులు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు బాలకృష్ణ, గణేష్, మల్లాజీ, బాలస్వామి, భగవంతు, అంజి పాల్గొన్నారు.

మూడు కాళ్లతో గేదె దూడ జననం



ఖానాపూర్‌కు చెందిన మున్నూర్ శేఖర్ గేదెకు పుట్టిన మూడు కాళ్ల దూడ

బిజినేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పాడి గేదె లేగదూడకు జన్మనివ్వగా వింతగా మూడు కాళ్లతోనే పుట్టింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన మున్నూర్ శేఖర్‌కు చెందిన గేదె శనివారం గేదె పిల్లను ప్రసవించింది. దానిని పరిశీలించిన రైతు మూడు కాళ్లు మాత్రమే ఉండడంతో ఆందోళన చెంది పశువైద్యాధికారికి సమాచారం ఇచ్చాడు. జన్యుపరమైన లోపాలు ఉంటే ఇలాంటి వింత దూడలు పుడుతాయని అన్నారు. మూడు కాళ్లతో ఉన్న గేదెదూడ ఆరోగ్యంగా ఉందని రైతు అన్నాడు. మూడు కాళ్లతో పుట్టిన దూడను ఆశ్చర్యంతో చూస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 32 మంది బాలబాలికల ఎంపిక



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

మక్తల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : క్రీడా దినోత్సవం రోజు పేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల్లో 32మంది రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు గోపాలం తెలిపారు. శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో 14,16,18ఏళ్ల విభాగంలో మొత్తం 32మంది రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్, శాలువాతో సత్కరించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 15మంది పీఈటీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూప, విష్ణువర్ధన్‌రెడ్డి, అంబ్రేష్, రమేష్‌కుమార్, రుద్రసముద్రం రామలింగం, నాగమణి, అంజనేయులు, ఉశప్ప, జగదీశ్వర్ పాల్గొన్నారు.

కారు బోల్తా - ముగ్గురికి గాయాలు

వెల్దండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రం సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు వెళుతున్న కారు వెల్దండ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో కారులో ఉన్న అచ్చంపేటకు చెందిన మన్నాన్, అతని భార్య రేష్మాబేగం, కుమారుడు ముసాధీర్‌లు గాయపడ్డారు. గాయపడ్డవారికి చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.


గద్వాల టీటీ యూత్ ఆధ్వర్యంలో గౌరీ దేవి చెంతన వినాయకుడి విగ్రహం


పేట సుభాష్‌రోడ్‌లో 18 అడుగుల వినాయకుడు


వనపర్తి బ్రహ్మంగారి వీధిలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో అలంకరించిన మండపంలో కొలువుదీరిన గణేశుడు


వనపర్తి వాసవీ ఆలయంలో దశావతారంలో అలంకరించిన మండపంలో కొలువుదీరిన లంబోదరుడు


జడ్చర్లలో పూరిజగన్నాథ్ రథయాత్ర అలంకరణలో..

వినూత్నం.. వినాయకం

సర్వ విఘ్నాలను తొలగించే విఘ్నేశుడు వినూత్నంగా వాడవాడలా పూజలందుకుంటున్నాడు. వినాయక చవితి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తూ.. మా విఘ్నాలు తొలగించు వినాయకా అంటూ పూజిస్తున్నారు. పలు చోట్ల విభిన్న ఆకారాల్లో సర్వాంగ సుందరంగా విఘ్నేశ్వరుల మండపాలను డెకరేషన్.. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా వినూత్న రీతుల్లో కొలువైన వినాయకుల దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాల్లో బంధించింది.

- న్యూస్‌నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, మహబూబ్‌నగర్, వనపర్తి


అప్పన్నపల్లిలోని హైందవ శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భక్తులు


అయిజ కృష్ణ వేణి పాఠశాలలో గుర్రాల రథచక్రాలపై ..


పేటలో కుర్వగేరి యువసేన ప్రతిష్ఠించిన నాట్యవినాయకుడు


మహబూబ్‌నగర్ పాల్‌సాబ్ గుట్ట వినాయకుడు


జడ్చర్ల పట్టణంలోని బాబీస్ట్రీట్‌లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గణనాథుడు


మహబూబ్‌నగర్‌లో కృష్ణ టాకీస్ వద్ద వినాయకుడు


పేట పత్తిబజార్‌లో సింహంపై కూర్చున్న వినాయకుడు


మహబూబ్‌నగర్‌లో కొత్తగంజ్‌లో గల వినాయకుడు

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

బాలానగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నీటి గుంతలో పడి జడ్చర్ల మునిసిపల్ పరిధిలోని కావేరమ్మపేటకు చెందిన ఆంజనేయులు (32) మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బాలానగర్ మండలంలోని బోడజనంపేటలో బీఎస్‌సీపీఎల్ క్రషర్ మిషన్‌లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అంజనేయులు వినాయకుని నిమజ్జనం ఉందని కంపెనీ నుంచి ఫోన్ రావడంతో బోడజానంపేట క్రషర్ మిషన్‌కి వెళ్లాడు. అయితే కంపెనీలో పనిచేస్తున్న లేబర్లు అందరు కలిసి పూజలు చేసుకొని నిమజ్జనం చేసేందుకు గ్రామ శివారులోని ఓ గుంత వద్దకు వెళ్లారు. వినాయకుడిని నిమజ్జనం చేస్తుండటంతో సాయంత్రం ప్రమాదవశాత్తూ నీటి గుంతలో పడి నీటిలో మునిగిపోయాడు. ఈ విషయాన్ని కంపెనీ లేబర్ ఫోన్ ద్వారా తెలుపడంతో తాము, మృతుని కుటుంబ సభ్యులం కలిపి వెళ్లి చూడగా చీకటి ఉన్నందుని ఆంజనేయులు కనిపించలేదని తెలిపారు. శనివారం ఉదయం వెళ్లి చూడగా మృతదేహం కనిపించిందని తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిదిలోని అలంపూరు చౌరస్తా సమీపంలో రాయచూరు వెళ్లే దారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. కర్నూలు జిల్లా దొడ్డిపాడు గ్రామానికి చెందిన నూర్ అహ్మద్ (50) అనే వ్యక్తి అల్కాలిస్ కంపెనీలో కూలీ పని చేసుకుంటూ జీవించేవాడు. శుక్రవారం పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వచ్చాడు. అదే రోజు రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడగా అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. భార్య పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

చారకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని కల్వకుర్తి - దేవరకొండ ప్రధాన రహదారిపై మర్రిపల్లి వద్ద శుక్రవారం రాత్రి రోడ్డుదాటుతున్న దాస్య అనే వ్యక్తికి ఢీకొట్టి అతని మృతికి కారణమైన మహబూబ్‌నగర్‌కు చెందిన కారు డ్రైవర్ షేక్‌రఫీక్‌పై కేసున మోదు నమోదు చేసినట్లు ఎస్ఐ శంషుద్దీన్ తెలిపారు.

వృద్ధురాలిపై పోస్టుమన్ దాడి

» చెన్నిపాడులో ఘటన


పద్మావతమ్మ

గద్వాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌కు వచ్చిన ఓ వృద్ధురాలిపై పోస్టుమాన్ దాడి చేశాడు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం, చెన్నిపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పింఛనుదారులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పద్మావతమ్మ అనే వృద్ధురాలు గత కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వృద్ధాప్య పింఛన్ పొందుతుంది. గత నెల పింఛన్ తీసుకునేందుకు శనివారం ఆమె గ్రామంలో ఉన్న పోస్టు ఆఫీసుకు వెళ్లింది. అనారోగ్యం కారణంగా ఆమె చాలాసేపు వేచి చూసి తాను నిలబడలేకపోతున్నాని, పింఛన్ ఇవ్వాల్సిందిగా ముందుకెళ్లగానే పోస్టుమాన్ నబి పరుగున వచ్చి ఆ వృద్ధురాలిపై విచక్షణరహితంగా దాడి చేశాడని గ్రామానికి చెందిన పింఛనుదారులు తెలిపారు.

ఈ హఠత్పరిణామంతో అక్కడ తోటి వృద్ధులు నిర్ఘాంతపోయామని తెలిపారు. ఇదేంటి సాయిబాబు అని ప్రశ్నించినవారిపై కూడా నానా దుర్భాషలాడారని, అక్కడ ఉన్న వృద్ధులు తెలిపారు. గతంలో ఇలాంటి ఘటనలు జరగకపోయినా పింఛన్‌కు వెళ్తే చీవాట్లు, చీదరింపులు తప్పేవి కావని పింఛనుదారులు వాపోయారు.

ఈ విషయంపై బాధితురాలు మాట్లాడుతూ.. ఏం చేస్తాం సారూ.. కొట్టింది నిజం కానీ ఏమైన అంటే వచ్చే నెల పింఛన్ కూడా ఇవ్వడు.. వాడి పాపాన వాడు పోతాడు.. నేనే వృద్ధురాలిని అతడితో పింఛన్‌కు వెళ్లిన ప్రతీసారి ఎన్నో మాటలు భరించాను.. ఈసారి నాపైనే దాడి చేశాడు. ఆ దేవుడే చూసుకుంటాడంటూ బదులిచ్చింది. ఈ విషయంపై జిల్లా అధికారి మాట్లాడుతూ.. ఆ విషయం తమ దృష్టికి రాలేదని, వృద్ధురాలిపై దాడి చేయడం సబబు కాదని తెలుసుకుని సోమవారం చర్యలు తీసుకుంటామని మండల పోస్టుమాస్టర్ రామ్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామ శివారులో ఘర్ డాబా సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తున్న ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. శనివారం బ్లూకోట్ విధులు నిర్వరిస్తుండగా మంజునాథ్‌నాయుడు అనుమానాస్పదంగా వస్తున్న లారీని తనిఖీ చేశారు. అందులో ఇసుక ఉండటంతో అనుమతులపై ఆరా తీయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సదరు లారీని ఠాణాకు తరలించి, తాడిపత్రికి చెందిన డ్రైవర్ జగదీష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేట, కొడంగల్ ఎత్తిపోతలకు వ్యతిరేకం కాదు

» భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వండి
» బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ

దామరగిద్ద, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మాణం చేసే రిజర్వాయర్‌కు తాము వ్యతిరేకం కాదని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ అన్నారు. రిజర్వాయర్‌లో భూములు కోల్పోయే రైతులకు బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం న్యాయమైన పరిహారం చెల్లించి రిజర్వాయర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కానుకుర్తి రిజర్వాయర్‌లో భూములు కోల్పోయే రైతులు గత 24 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు శనివారం మద్దతు తెలిపి మాట్లాడారు. ముఖ్యమంత్రి మన జిల్లా వాసి ఉండి భూములు కోల్పోయే రైతులకు న్యాయం చేయకుంటే ఎలా అని ప్రశ్నించారు. సీఎం అనుకుంటే పరిహారం పెంచడం పెద్ద పని కాదన్నారు. నారాయణపేట నియోజక వర్గ రైతులు భూములు కోల్పోయి త్యాగం చేసి కొడంగల్ నియోజక వర్గానికి నీళ్లు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇంత త్యాగం చేసిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సత్యయాదవ్ మాట్లాడుతూ ప్రాజెక్టు డీపీఆర్ రైతులు ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. రైతుల అనుమతి లేనిదే వారి పొలాల్లోకి వస్తే ఊరుకునేది లేదన్నారు. రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించి రిజర్వాయర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు సంజీవగౌడ్, సత్యనారాయణ, రఘు, రామయ్యగౌడ్, గోపాల్‌రావు, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, బసిరెడ్డి, బస్వరాజు, భీంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


కానుకుర్తి దీక్షలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ

క్యూ కట్టినా.. కొసరుతోనే సరి..

యూరియా కోసం కర్షకలోకం క్యూకట్టింది. ఎరువుల కోసం రోజూ ఏకరువు పెడుతున్నా అధికారుల్లో చలనం కనిపించటం లేదు. కొరత లేదంటూనే మొక్కుబడిగా ఒకట్రెండు బస్తాలతో సరిపెడుతున్నారు. దీంతో రైతులు పీఏసీఎస్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన దౌర్భాగ్యం నెలకొంటున్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం అన్నదాతలు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. శనివారం కూడా పలు ప్రాంతాల్లో క్యూకట్టినా యూరియా దొరక్క నిరాశతో వెనుదిరగడం కనిపించింది. కొందరైతే దొరికిన కాడికి మహాప్రసాదంగా భావించి తీసుకెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో పోలీసుల సమక్షంలో యూరియా సరఫరా కొనసాగింది. కొందరు రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి.


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ముందు యూరియా కోసం బారులు తీరిన రైతులు

కందనూలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ముందు శనివారం క్యూ కట్టారు. సహకార సంఘానికి యూరియా వచ్చిందన్న విషయం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచి వచ్చి సహకార సంఘం నుంచి ఒక్కొక్కరు రెండు బస్తాల చొప్పున యూరియాను రైతులు తీసుకెళ్లారు.

● ఉప్పునుంతల: రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు అన్నారు. శనివారం ఉప్పునుంతలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ముందు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాయకులు సైదులు, చంద్ర, నరేస్, సాయిబాబు, గెలుమయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

● శ్రీరంగాపురం: శ్రీరంగాపురం మండల పరిధిలోని వెంకటాపూర్ ప్రాథమిక సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. పట్టా పాసు బుక్ ,ఆధార్ కార్డుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తామని అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

● గోపాల్‌పేట: వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో యూరియా కోసం రైతున్నలు కష్టాలు పడుతున్నారు. శనివారం ఉదయం నుంచే మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఎదుట రైతులు క్యూలో నిలబడ్డారు. గంటల సమయంలో క్యూలో నిలుచున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తోపులాట జరుగుతుందని ఉద్దేశంతో పోలీసులు ప్రవేశించి యూరియా బస్తాలను రైతులకు క్రమంగా పంపిణీ చేశారు.

● అయిజ: యూరియా కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. పనులు వదులుకుని యూరియా సంచుల కోసం క్యూలో ఎదురు చూడాల్సి వస్తోంది. శనివారం అయిజ రైతు వేదిక ముందు వివిధ గ్రామాలకు చెందిన రైతులు గుమిగూడారు. ఎస్ఐ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి జనార్దన్, సింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్‌రెడ్డిలు పర్యవేక్షించారు. రైతులకు ముందస్తుగా టోకెన్‌లు పంపిణీ చేసిన అనంతరం ఒక్క రైతుకు 2 బస్తాల చొప్పున యూరియా అందచేయటం జరిగింది.

● హన్వాడ: యూరియా కోసం అన్నదాతలు ఉదయం నాలుగు గంటలకే క్యూ కట్టారు. శనివారం హన్వాడ ప్రాథమిక వ్యవసాయ కేంద్రానికి 300 బస్తాల యూరియా తెల్లవారుజామున వచ్చింది. విషయం తెలిసి ఉదయం 4 గంటలకు పంపిణీ కేంద్రం వద్దకు వచ్చారు. అప్పటి నుంచే మహిళలు, పురుషుల దాదాపుగా 600 మందికి పైగానే రైతులు వచ్చారు.

● దేవరకద్ర: మండలంతో పాటు నాగారం సహకార సంఘం కార్యాలయం వద్ద శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. రెండు సంఘాలకు రెండు యూరియా లారీలు రావడంతో 400 మంది రైతులు తీసుకునేందుకు వచ్చారు. ఒక్క బస్తా ఇవ్వడంతో దీంతో మరికొంత మందికి దొరకకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

టోకెన్ల జారీలో పోలీసులతో వాగ్వాదం

అమరచింత/ ఆత్మకూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా అమరచింత మండల శివారులో పీఏసీఎస్ తాత్కాలిక యూరియా విక్రయ కేంద్రాన్ని శనివారం ఆత్మకూరు అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడిగా ఉన్న ఆత్మకూరు పీఏసీఎస్ కేంద్రం వద్ద రద్దీ ఎక్కువ కావడంతో అధికారులు అమరచింత మండల రైతుల కోసం జూరాల ప్రాజెక్టు క్రాస్ రోడ్ వద్ద యూరియా విక్రయ కేంద్రాన్ని ప్రారంభించగా మండలంలోని ఆయా గ్రామల రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి యూరియా కోసం మళ్లీ బారులు తీరారు. పోలీస్ పహారా మధ్య ఆత్మకూరు అమరచింత వ్యవసాయ, పీఏసీఎస్ అధికారులు రైతులకు టోకెన్లను అందజేస్తున్నారు. టోకెన్ల జారీ క్యూల వద్ద రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒక్కొక్క రైతు పాస్ బుక్‌కు రెండు సంచుల యూరియాను అందించనట్లు పీఏసీఎస్ సీఈవో నరేష్ పేర్కొన్నారు.

● ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయం ముందు శనివారం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ డబ్బులు పెట్టకుండా యూరియా ఊరికే ఇస్తున్నాం అనే రీతిలో ఒక్కో బస్తా రెండు బస్తాలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. రైతులకు సరిపడా యూరియా ఇచ్చి సహకరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రైతులను వరుస క్రమంలో నిలబెట్టి ఒక్కొక్కరికి రెండు బస్తాలు పంపిణీ చేయడానికి ఆత్మకూరు ఎస్ఐ నరేందర్, అదనపు ఎస్ఐ హిమబిందు రాథోడ్‌లు శ్రమించాల్సి వచ్చింది.


అమరచింతలో యూరియా టోకెన్ల జారీ వద్ద రైతులు

ముస్లిం యువకుడి అన్నదానం


పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో గణేష్‌యూత్ వారు ప్రతిష్ఠించిన గణేశ్ విగ్రహం వద్ద అన్నదానం చేస్తున్న ముస్లిం యువకుడు సలీం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో జై గణేశ్ యువక బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద డెకరేషన్ సలీం శనివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకన్నా ముందు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ముస్లిం యువకుడు సలీం అన్నదానం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో విగ్రహ దాత రైస్‌మిల్ సాయి, రాజాశెట్టి, జై గణేష్ యూత్ సభ్యులు నవీన్, శ్రీనివాసులు, ధర్మతేజ, ఓంకార్, నవీన్‌గౌడ్, సురేష్, వంశీ, నరేష్ తదిత రులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక విద్యలో పట్టు సాధించాలి

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్
» వర్సిటీలో ఓరియెంటేషన్ ప్రోగ్రాం



సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు శాస్త్రసాంకేతిక విభాగంలో అవగాహనతో కూడిన విద్యను అభ్యసించి సబ్జెక్టులపై పట్టు సాధించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఉన్నతస్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. శనివారం పీయూలో పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రాం కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కనుక విద్యార్థులు సబ్జెక్టుతోపాటు స్కిల్స్ పేపర్ ప్రజెంటేషన్ సాధన చేస్తే మంచి ఆఫర్లు వస్తాయని అన్నారు. విద్యార్థులు ఇంజనీరింగ్ రంగంలో పరిశోధనలు చేస్తే మరింత గుర్తింపు వస్తుందని అన్నారు. అంతకుముందు పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబు మాట్లాడుతూ నూతనంగా వచ్చిన విద్యార్థులకు తల్లి దండ్రులకు పీయూలో వసతుల గురించి వివరించారు. విద్యార్థులకు నూతనంగా విచ్చేసిన ఇంజనీరింగ్ అధ్యాపకులను పరిచయం చేశారు. పీయూలో మొదటిసారిగా సోమవారం నుంచి ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభమౌతాయని, విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్ సూచించారు. పీయూ పీజీ కళాశాల పిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పీయూ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ డాక్టర్ మన్నెమోని కృష్ణయ్య, ఎంఈబీ ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణకర్‌రెడ్డి, పీయూ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికాంత్, పీయూ ఉన్నత అధికారులు డాక్టర్ గౌస్ పాష, ఎస్ఎన్ అర్జున్ కుమార్, డాక్టర్ గాలెన్న, డాక్టర్ రాంమోహన్, ఇంజనీరింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

దశలవారీగా గ్రామ సమస్యలు పరిష్కారం

● నేరడగమ్ము పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి తిమ్మప్ప



మాగనూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నేరడగమ్ము గ్రామ సమస్యలు, అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి తిమ్మప్ప అన్నారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని ప్రజలు అంటున్నారు.?

పది రోజుల క్రితం పైపులైన్ పగిలిపోవడంతో నీరు రాలేదు. ప్రస్తుతం గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతోంది.

చెత్త సేకరణ చేస్తున్నారా?

మాజీ సర్పంచు సహకారంతో ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ చేస్తున్నాం. పంచాయతీలో నిధులు లేవు. రెండునెలల నుంచి పారిశుధ్య కార్మికుల వేతనాలు రావడం లేదు.

గ్రామ పంచాయతీకి ఆదాయం ఎలా వస్తుంది?

ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌గా గుర్తించిన నాటి నుంచి గ్రామంలో ఇంటి టాక్స్ కానీ ఇతరత్రా ఏమి వసూలు చేయడం లేదు.

గ్రామంలో ఏమైనా అభివృద్ధి పనులు జరుగుతున్నాయా?

ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ఎస్సీ వార్డులో సీసీ రోడ్లు వేస్తున్నాం.

న్యూస్ బాక్స్

వైద్య సేవలు వినియోగించుకోవాలి

ఊట్కూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముక్తభారత్ అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి టీబీ, వివిధ రకాల రక్త పరీక్షలు, ఎయిడ్స్ పరీక్షలను నిర్వహించి రోగ నిర్ధారణ అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోషీ మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి అన్ని రకాల వైద్యం అందిస్తున్నదని అన్నారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ భవాని, సూపర్‌వైజర్లు నరసింహులు, సిబ్బంది, శారద, గోవిందమ్మ, కవిత, ముక్త్ భారత్ సిబ్బంది ప్రసాద్, బాలరాజ్, అశ్విని, నరసింహా తదితరులున్నారు.

కమిషనర్‌కు సన్మానం

నారాయణపేటరూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మునిసిపల్ కమిషనర్ నర్సయ్యను బీజేపీ నాయకులు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నందునామాజీ, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్, హిరణ్యగర్భస్వామి, మొగులప్ప తదితరులున్నారు.

ఉపాధి పనుల్లో అక్రమార్కులపై చర్యలు కోరుతూ ఫిర్యాదు

మక్తల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖానాపూర్ గ్రామంలో జరిగిన ఉపాధి అక్రమాలపై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శి, పోస్ట్‌మన్, ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ సతీష్‌కుమార్‌లకు ఆ గ్రామస్థులు వినతిపత్రం అందించారు. ఇదిలా ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు ఎంపిక చేశారని పంచాయతీ కార్యదర్శి రేచల్‌ను గ్రామస్థులు ప్రశ్నించగా తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, ఎంపీడీవో రమేష్‌లు గ్రామస్థులకు నచ్చజెప్పి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

డీజేలకు అనుమతి లేదు

ఊట్కూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శబ్ద కాలుష్య నియంత్రణలో భాగంగా సుప్రీంకోర్టు ఆదేశాలతో గణేశ్ ఉత్సవాల్లో డీజేల వినియోగం నిలిపివేయడం జరిగిందని ఊట్కూర్ ఎస్‌ఐ రమేష్ శనివారం తెలిపారు. కొన్ని సోషల్ మీడియా గ్రూపుల్లో డీజేలు పెట్టడానికి అనుమతి తీసుకున్నట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

నారాయణపేటరూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. బాలసభలో భాగంగా మాదిరి ఎన్నికల్లో విద్యార్థులకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఎంఈవో బాలాజీ హాజరై కార్యక్రమాన్ని తిలకించారు. హెచ్‌ఎం జయప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మహేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సుజాత, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆవిర్భావం

కోస్గి రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆవిర్భావం సందర్భంగా శనివారం కోస్గి మండలం చెన్నారంలో అంబేడ్కర్ విగ్రహానికి సమితి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ వెంకటేష్, లక్ష్మన్ తదితరులున్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణించేదెలా

» అధ్వానంగా బీటీ రహదారులు
» పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు



వర్కూరు నుంచి నేరడగమ్ము గ్రామానికి వెళ్లే రహదారి



మాగనూరు నుంచి వర్కూరుకు వెళ్లే రహదారి

మాగనూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే బీటీ రహదారులు ఇటీవల ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి పూర్తి అధ్వానంగా మారాయని.. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారిన గ్రామాల రహదారులు మారడం లేదని వారు విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రహదారుల మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయని త్వరలోనే టెండర్లు వేసి పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారే తప్ప నేటివరకు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. రహదారులు పూర్తి గుంతలు గుంతలుగా ఏర్పడి ప్రయాణించాలంటేనే జంకుతున్నామని వాపోయారు. రాత్రివేళల్లో ఈ గుంతల మీదుగా ప్రయాణించి కింద పడి గాయాలైన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా గర్భిణులను, వృద్ధులను ఇతరత్రా జ్వర పీడితులు ఉంటే ఈ రహదారిపై ఆసుపత్రులకు వెళ్లేలోపు మరణించే ప్రమాదాలు లేకపోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాలకు వెళ్లే రహదారులను మరమ్మతులు చేయడంతో పాటు, మట్టి రహదారులను బీటీగా మార్చాలని వారు కోరుతున్నారు.

వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి..



మండలంలోని బీటీ రోడ్లు గుంతలుగుంతలు ఏర్పడి అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటేనే భయమేస్తోంది. వాహనదారులు వాహనాలు నడపాలంటేనే జంకుతున్నారు. రోడ్ల మూలంగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి.

- వాకిటి మల్లేష్, నేరడగమ్ము

త్వరలో అదనపు తరగతి గదుల నిర్మాణం

» గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్



విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కోస్గి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కోస్గి బాలుర జడ్పీహెచ్‌ఎస్‌లో త్వరలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడతామని గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులకు లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో తాము కూడా చదువుకున్నామని గుర్తు చేశారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, కిచెన్ షెడ్ ఏర్పాటు ఆవశ్యకతను ముఖ్యమంత్రికి వివరించి నిధులు తీసుకువస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు చైర్మన్‌ను సన్మానించారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ అన్నపూర్ణహరి పాఠశాలకు గోడ గడియారాన్ని బహూకరించారు. లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎవరికైనా ఆర్థిక ఇబ్బందులు ఉండి చదువు మానేసే పరిస్థితి ఉంటే తనను సంప్రదించాలని, ఉన్నత చదువులు చదివించేందుకు ఆర్థిక సహాయం చేస్తానని పేర్కొన్నారు. క్లబ్ సభ్యులు కృష్ణగౌడ్, వెంకట్రాములు, బాల్‌రాజ్ ఉన్నారు.

తీలేరు పీఏసీఎస్ వద్ద పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ



సహకార సంఘం వద్ద అధికారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

మరికల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా పంపిణీ పరిస్థితిని ఎస్పీ యోగేష్‌గౌతమ్ సమీక్షించారు. శనివారం మధ్యాహ్నం సహకార సంఘం కార్యాలయానికి చేరుకున్న ఆయన యూరియా సమస్యను అధికారులనడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం పోలీస్ బందోబస్తుతో యూరియా పంపిణీ సజావుగా జరుగుతోందని అన్నారు. పోలీసులు రైతులతో దురుసుగా వ్యవహరించొద్దని, సహనంతో ఉండాలని అన్నారు. పంపిణీ కేంద్రం వద్ద ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. సీఐ రాజేందర్‌రెడ్డి, సహకార సంఘం అధికారులు ఉన్నారు.

యూరియా కొరతపై నిలదీత

కొత్తపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై బీఆర్‌ఎస్ నాయకులు ఏవో కే.రమేశ్‌ను నిలదీశారు. శనివారం మండల కేంద్రంలోని చౌరస్తా వద్దనున్న ఓ ఫర్టిలైజర్ దుకాణం నుంచి యూరియా పంపిణీ జరుగుతుండగా ఏవో అక్కడికి వచ్చి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కొంతమంది రైతులకు యూరియా అందకపోవడంతో దుకాణం ముందు ఆందోళనకు దిగారు. రైతుల ఆందోళనకు బీఆర్‌ఎస్ మండల నాయకులు మద్దతు పలికారు. అక్కడే ఉన్న ఏవోను వారు నిలదీశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వచ్చిన యూరియాను ఎప్పటికప్పుడు రైతులకు అందిస్తున్నామని, అందని రైతులకు సోమవారం భూనీడ్ మండల కేంద్రంలో అందిస్తామని నచ్చజెప్పారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్, కొత్తపల్లి మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మండల నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలో సరఫరాకు నోచుకోని రైతన్నలు

మరికల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నంచి యూరియాకు రైతులు నోచుకోవడం లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి కొరత లేకుండా యూరియాను సరఫరా చేశామన్నారు. రైతులకు యూరియా అందించని ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలన్నారు. శనివారం మండలంలోని తీలేరు పీఏసీఎస్ ముందు రైతులపై పోలీసులు లాఠీ ఝుళిపించడంపై వారు మండిపడ్డారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వీరబసంతు, విష్ణువర్ధన్‌రెడ్డి, మతిన్, మాసన్న, మల్లేష్ తదితరులున్నారు.

రైతులకు సకాలంలో పంపిణీ చేయాలి

ఊట్కూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరికి సకాలంలో యూరియాను పంపిణీ చేసి ఆదుకోవాలని కోరుతూ బీజేపీ మండల నాయకులు శనివారం మండల ఏవో గణేష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. యూరియా కొరత కారణంగా రైతులకు వ్యవసాయ పనుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కిరణ్‌కుమార్, నాయకులు ఆశప్ప, వెంకటేష్, నరసింహాగౌడ్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మణ్, గోపాల్, హన్మంతు ఉన్నారు.

50 ఏళ్ల సమస్యకు పరిష్కారం

» మద్దూర్ పాత బస్టాండ్ మార్గంలో 48 నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు
» పట్టణ వాసులకు తప్పిన విద్యుత్ గండం



మద్దూర్ పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేస్తున్న నూతన విద్యుత్ స్తంభం

మద్దూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం మద్దూర్ పాత బస్టాండ్ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మద్దూర్‌లోని పాత బస్టాండ్ మార్గంలో ప్రమాదభరితంగా మారిన విద్యుత్ స్తంభాల విషయాన్ని స్థానిక నాయకులు ఇటీవలే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖ యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకొని 48 స్తంభాలతో ప్రధాన రోడ్డు మార్గంలో కొత్త లైన్ ఏర్పాటు చేశారు. దీంతో గణేశ్ ఉత్సవాల్లో ఎలాంటి ప్రమాదం జరగకుండా సాఫీగా నిమజ్జనానికి తరలించేందుకు అవకాశం ఏర్పడింది. పట్టణంలో కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటరు లిస్టు జాబితా అభ్యంతరాలపై సమావేశం

మాగనూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు లిస్టు జాబితాల అభ్యంతరాలపై శనివారం స్థానిక పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ సురేష్‌కుమార్‌లు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. బైరంపల్లి గ్రామంలో కర్ణాటక వారి పేర్లు ఓటరు లిస్టులో వచ్చాయని వారి పేర్లను తొలగించాలని సభ్యులు కోరగా పరిశీలిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, శివరాంరెడ్డి, సీపీఎం నాయకుడు అంజనేయులు, బీజేపీ నాయకుడు అశోక్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలప్ప, దండు ఆనంద్, వాకిటి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యం

కోస్గి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజ అన్నారు. శనివారం పట్టణంలోని 1, 8వ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులు పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలో మొదటి నుంచి విద్యార్థులకు ఏఏ కార్యక్రమాలు నిర్వహించారు, విద్యార్థులు ఏం నేర్చుకున్నారు తదితర అంశాలను ఉపాధ్యాయులు చిన్నారుల తల్లులముందు చెప్పించారు. అలాగే ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్‌లో భాగంగా నేర్పించనున్న అంశాలు, చేపట్టే కార్యక్రమాలు తదితర అంశాలపై తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసన్న, అరుణ తదితరులున్నారు.

నానో యూరియాపై అవగాహన

దామరగిద్ద, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా పైర్లకు వాడకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని డీఏవో జాన్ సుధాకర్ రైతులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో ఆయన రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఏవో మణిచందర్ ఉన్నారు.

సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాలి



ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు విక్రమ్‌రెడ్డి

కోస్గి రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతీ ఒక్కరు లబ్ధి పొందాలని కాంగ్రెస్ పార్టీ గుండుమాల్ మండల అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక రైతువేదిక కార్యాలయంలో ముస్లిం మహిళలకు ఆయన కుట్టుమిషన్లు అందించారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయిప్రకాష్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, జహీరుద్దీన్ తదితరులున్నారు.

మానవ హక్కులపై అవగాహన ర్యాలీ

మక్తల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు నుంచి డిగ్రీ కళాశాల వరకు హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరెప్షన్ ఫోరం (మానవ హక్కులు అవినీతి నిరోధక సంస్థ) ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రావునల్వాడే ఆదేశాల మేరకు రాయచూరు జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌సాదిక్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు తంగిడి నాగరాజు మానవ హక్కులు, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. సంస్థ ఉపాధ్యక్షుడు గవినోళ్ల జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీరామ్, కార్యదర్శులు సూర్య ఆంజనేయులు, కేశిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వినాయకుడి ఆశీస్సులు అందరికీ ఉండాలి

» కలెక్టర్ సిక్తా పట్నాయక్



కలెక్టరేట్‌లో వినాయక పూజలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నారాయణపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయకుడి ఆశీస్సులు అందరికీ ఎళ్లవేళలా ఉండాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం నారాయణపేట కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన మండపంలో ఆమె గణేశుడి పూజలో పాల్గొని ఆ తర్వాత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే మునిసిపల్ కార్యాలయం మెప్మాలో ప్రతిష్ఠించిన వినాయకుడికి కమిషనర్ నర్సయ్య పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, ఎమ్మెల్యే పీఏ చిట్టెం మాధవరెడ్డి, టీపీవో టిపిట కిరణ్, శివకుమార్ తదితరులున్నారు. సుభాష్‌రోడ్ కొండారెడ్డి మందిరం వద్ద 18 ఫీట్ల గణపతిని ప్రతిష్ఠించి నాలుగో రోజు అన్నదానం చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు బండి ఆనంద్, కృష్ణ, అనిల్, రాజు తదితరులున్నారు. శక్తిపీఠంలో కొనసాగుతున్న వినాయక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్వామి శాంతానంద ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

జర్నలిస్టులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

» పేటలో జర్నలిస్టుల వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ

నారాయణపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ప్రజలకు సేవ చేయాలంటే ఆరోగ్యం ముఖ్యమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఐజేయూ) ఆధ్వర్యంలో నారాయణపేట లయన్స్‌క్లబ్, హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆసుపత్రి, నేత్రా సనత్‌నగర్ వారి సహకారంతో జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో శనివారం జర్నలిస్టులు, కుటుంబ సభ్యులకు మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కలెక్టర్‌తో పాటు, ఎస్పీ యోగేష్‌గౌతమ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శిబిరంలో కలెక్టర్, ఎస్పీలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. డీపీఆర్‌వో రషీద్, యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, శివశంకర్, సంజీవ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారుల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



బాలసదనం చిన్నారులతో సీనియర్ సివిల్ న్యాయాధికారి

నారాయణపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): లైంగిక నేరాల నుంచి చిన్నారుల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని సీనియర్ సివిల్ న్యాయాధికారి వింధ్యనాయక్ అన్నారు. శనివారం నారాయణపేట పట్టణంలోని బోరంబావి వద్దనున్న వృద్ధాశ్రమం, బాల సదనం హోమ్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోమ్‌లో ఉన్న హాజరు పట్టికను పరిశీలించారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి ఆదేశించారు. 24 గంటల పాటు అందుబాటులో ఉండి వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా సొంత ఇంటి వారిగా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

గణేశ్ మందిర్‌లో ఎస్పీ ప్రత్యేక పూజలు



వినాయకుడి పూజలో పాల్గొన్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ తదితరులు

నారాయణపేట రూరల్/ఊట్కూర్/మక్తల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని దూల్‌పేట గణేశ్ మందిరంలో శనివారం ఎస్పీ యోగేష్‌గౌతమ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నందునామాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, పట్టణ అధ్యక్షుడు పోషల్‌వినోద్, వీహెచ్‌పీ, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని పత్తిబజార్ మండపంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావునామాజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీలర్ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

అదేవిధంగా, ఊట్కూర్‌లోని భవానీ మందిర్‌లో వినాయకుడిని ఎస్పీ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి సెప్టెంబరు 4న నిర్వహించనున్న నిమజ్జన ఉత్సవాల రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఊట్కూర్ పెద్ద చెరువును పరిశీలిస్తు అధికారులకు పలు సూచనలు చేశారు. సీఐ రాంలాల్, ఎస్‌ఐ రమేష్, ఉత్సవ కమిటీ సభ్యులు అరవింద్‌కుమార్, భరత్, సూర్యప్రకాశ్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, హన్మంతు, అనిల్, మహేశ్వర్‌రెడ్డి, మండపాల నిర్వాహకులు ఉన్నారు. అంతకుముందు ఊట్కూర్, పులిమామిడి, మగ్దూంపూర్, బిజ్వార్ గ్రామాల్లో బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ పోలీస్ బృందాలు తనిఖీలు చేశారు.

మక్తల్ పట్టణంలో గణేశ్ విగ్రహాలు వెళ్లే రూట్‌తో పాటు, పెద్దచెరువు కట్టను శనివారం రాత్రి డీఎస్పీ లింగయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రజాపాలన అంటే రైతు చెంప చెల్లుమనిపించడమేనా.?

» బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాప్రభుత్వ పాలనా అంటే యూరియా అడిగినందుకు రైతు చెంప చెల్లుమనిపించడమేనా అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి శనివారం విమర్శించారు. సీఎంకు తెలిసిన విద్య మాటలు మార్చడమే తన నైజం అన్నారు. ఇందిరమ్మ కాంగ్రెస్ రాజ్యం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని ఏఐ ఫేక్‌ఫోటోలతో ప్రచారం అన్నారని.. తీరా క్యూలో ఉన్నది రైతులు కాదని బీఆర్‌ఎస్ కార్యకర్తలే లైన్‌లో నిలుస్తున్నారని చెప్పారని.. మళ్లీ కారణం మాది కాదు కేంద్రంలోని బీజేపీదే అని అంటున్నారన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్లే ఈ సంక్షోభం అంటున్నా యుద్ధం వల్ల కాదు.. కాంగ్రెస్ సిద్ధంగా లేకపోవడం వల్ల సంక్షోభం తలెత్తిందని రైతులకు అర్థమై పోయిందని ఆరోపించారు.

అన్నదాతపై చేయి చేసుకోవడం తగదు

దేశానికి అన్నం పెట్టే అన్నదాతపై ఎస్‌ఐ చేయి చేసుకోవడం తగదని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కనుసన్నల్లో మెదులుతూ రైతులను గాలికి వదిలేశారన్నారు. రైతులకు అవసరమైన యూరియా, ఎరువులు అందించాలని లేకపోతే రైతు సంఘాలతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పేదల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

మక్తల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధి కాంగ్రెస్ ధ్యేయమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏ.రవికుమార్, సీనియర్ నాయకుడు కట్ట సురేష్‌కుమార్‌గుప్తా అన్నారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మక్తల్ మునిసిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారు లబ్ధిదారులకు అందించి, మాట్లాడారు. నాయకులు కట్టవెంకటేష్, గోలపల్లినారాయణ, లక్ష్మణ్, వాకిటిశ్యామ్, గుంతలిశివకుమార్, కల్లూరి గోవర్దన్, మొగిలప్ప, అశోక్‌గౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

పీఈటీలకు సన్మానం

క్రీడా వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని పరిషత్ కార్యాలయం వద్ద మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పీఈటీలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. డీవైఎస్‌వో వెంకటేష్‌శెట్టి, ఎంఈవో అనిల్‌గౌడ్, ఎంపీడీవో రమేష్, గణేష్‌కుమార్, నాయకులు గణేష్‌కుమార్, నూరుద్దీన్, ఫయాజ్, అబ్దుల్ రహమాన్, బోయ నర్సింహ, అఫ్రోజ్, రమేష్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పంపిణీ

ఊట్కూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 500కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు లయన్స్‌క్లబ్ మహబూబ్‌నగర్, నారాయణపేటల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రోత్సాహక నగదు బహుమతిని అందించారు. మండలంలోని 12 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.11 వందల చొప్పున నగదును అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాధవి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని వాటి సాధన కోసం కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అంతకుముందు ఊట్కూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు హన్మంతు, కార్యదర్శి శ్రీధర్ మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, లయన్ అమృత్‌శ్రీహరి, లయన్ గాజుల శ్రీనివాస్, గోనవెంకటేష్, నారాయణపేట అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, భరత్, శంకర్, రామాంజనేయులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అరవింద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.